## క్లుప్తంగా

### బ్రహ్మోత్సవాలకు రథం ముస్తాబు

- పోటీపోటీగా ఏర్పాట్లు



సిద్ధమవుతున్న రథం

**ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని శ్రీవేణు గోపాలస్వామి ఆలయంలో ఏటా కార్తీకమాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు మొదలుపెట్టారు. ప్రధాన ఘట్టమైన పెద్దరథం ఊరేగింపునకు రథాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఆలయ నూతన కమిటీ ఆధ్వర్యంలో రథానికి రంగులు వేయిస్తున్నారు. పాత కమిటీ, నూతన కమిటీలు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్నాయి. 27 కులసంఘాల మద్దతుతో ప్రస్తుతం కొనసాగుతున్న కమిటీ ముందుకెళ్తుండగా, సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరికి వారే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చేస్తున్నారు. బాలాలయంలోని ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేస్తున్నారు. ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈసారి రెండు కమిటీల మధ్య వేడుకలు ఎలా జరుగుతాయో వేచిచూడాల్సిందే.

### జిల్లా సరిహద్దుల్లో తనిఖీలు



తనిఖీలు చేస్తున్న పోలీసులు

**ముస్తాబాద్:** మండలంలోని వెంకట్రావుపల్లె జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టులో పోలీసులు, స్క్వాడ్ అధికారులు ఆదివారం తనిఖీలు చేపట్టారు. సిద్దిపేట జిల్లా నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాలోకి వస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వారు ఎక్కడి నుంచి వస్తున్నారు. ఎక్కడికి వెళ్తున్నారో ప్రశ్నించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, బంగారు ఆభరణాలు తీసుకెళ్లారాదని సూచించారు.

### ఉచిత వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని రాజన్నపేటలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న 103 మందిని పరీక్షించి అవసరమున్న వారికి రక్త, మూత్ర పరీక్షలు నిర్వహించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురిని మెరుగైనా వైద్యం కోసం సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. బీపీ, షుగర్ వ్యాధులతో బాధపడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పయ్యావుల రామచంద్రం, జిల్లా క్యాబినెట్ మెంబర్ ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ ముక్క శంకర్, సభ్యులు నాగరాజు, బాలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

# నీటి కోసం పత్తి రైతుల పాట్లు

- నెలన్నరగా కురవని వర్షాలు
- అర కిలోమీటర్ మేర పైప్‌లైన్లతో నీరు పంపింగ్
- నీటి పదను లేక దిగుబడి తగ్గే అవకాశం



పత్తి చేలో పైపులతో నీరు పెడుతున్న రైతు

**బోయినపల్లి:** ''వానాకాలం సీజన్ ప్రారంభంలో వర్షాలు లేవు. కొంతమంది రైతుల పత్తి యిత్తులు మొలకలు రాలేదు. తర్వాత రోజూ వర్షాలు కురిసి పత్తిలో కలుపు తీయలేదు. కొంత గెరువైనంక కలుపులు తీస్తే వర్షాలు లేవు. వర్షాభావంతో పత్తి దిగుబడిపై ఆందోళనలో పడ్డారు రైతులు.'' ఇది ఈ ఏడు పత్తి రైతుల ఆవేదన. చేలలో నీటి పదును కోసం పత్తి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. నెలన్నరగా వర్షాల జాడ లేక పోవడంతో నీరు లేక పూత కాత సమయంలో పత్తి చేలను కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మొదట పత్తి విత్తనాలు వేసి కొంత నీటి వసతి ఉన్న రైతులు ఇప్పుడు పత్తి విక్రయిస్తుండగా, మెజార్టీ రైతులు పంటను కాపాడుకోవడానికి కష్ట పడుతున్నారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో సుమారు 60, 158 ఎకరాల్లో పత్తి పంట వేసినట్లు అధికారులు తెలిపారు. వీటిలో బోయినపల్లి మండలంలో 6,180 ఎకరాల్లో పత్తి పంట వేసినట్లు ఎంఏవో ప్రణీత తెలిపారు. రెండేళ్లుగా పత్తి పంట వేయడం రైతులు ఏ ఏటికి ఆ ఏడు తగ్గిస్తూ వస్తున్నారు. కూలీల కొరత, వర్షాభావ పరిస్థితులు, పెట్టుబడి ఖర్చులు భారీగా పెరగడం ఆశించిన దిగుబడి రాక, మద్దతు ధర లేక పత్తి రైతులు ఆవేదన చెందుతున్నారు.

**నెలన్నరగా కానరాని వర్షాలు**

వర్షాధారంగా పత్తి పంట వేసిన రైతులు నెలన్నరగా వర్షాలు లేక పంటలు కాపాడుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో వర్షాలు కురిసిన అనంతరం ఇప్పటి వరకు వర్షాలు కురవకపోవడంతో పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీసారి అక్టోబర్ నెల చివరి వరకు వర్షాలు కురిసేవి. దీంతో అడపా దడపా వర్షాలు పడడంతో పత్తి చేలు పచ్చగా ఉండేవి. ఈసారి నెలన్నర నుంచి వర్షాలు లేక పత్తి పూత, కాత సరిగ్గా రాక ఇబ్బందులు పడుతున్నారు. ఎర్ర భూములతో పాటు, నల్ల రేగడి భూముల రైతులు సైతం పత్తి చేలకు నీరు పెట్టేందుకు తంటాలు పడుతున్నారు.

**పత్తి చేలకు అద్దె నీరు**

పత్తి పూత, కాత సమయంలో వర్షాలు లేక నీరు అందకపోవడంతో పలువురు రైతులు పత్తి చేలను కాపాడుకోవడానికి నీటి వసతి ఉన్న బావులు, బోరు బావుల యజమానులకు నీటి అద్దె చెల్లించి పత్తి చేలకు నీరు అందిస్తున్నారు. బోయినపల్లిలో సుబ్బారావు అనే కౌలు రైతు 15 ఎకరాల మేర భూమి కౌలుకు తీసుకుని వేసిన పత్తి పంటకు నీరు అందించేందుకు అష్టకష్టాలు పడుతున్నాడు. వేరే వ్యక్తి బోరు బావి నుంచి సుమారు అర కిలోమీటర్ మేర పైపులు ఏర్పాటు చేసి కొంత అద్దె చెల్లించి పైపుల ద్వారా పత్తి చేలకు నీరు అందిస్తున్నట్లు సుబ్బారావు తెలిపాడు. పైపుల కొనుగోలుకే సుమారు రూ.50 వేల వరకు ఖర్చు చేసినట్లు తెలిపాడు. సాధారణంగా పత్తి పంటను వర్షాధార పంటగా వేస్తారు. ఎర్ర నేలల్లో ఐతే పత్తి చేలకు నీరు కడతారు. నల్లరేగడి నేలల్లో వర్షాధార పంటగా పత్తి పంట వేస్తారు. ఐతే ఈసారి నెలన్నరగా వర్షాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎకరా పత్తి చేనుకు సుమారు రూ.20 వేల వరకు ఖర్చు వస్తుందని తడగొండ రైతు రాజిరెడ్డి చెప్పాడు. ఎకరాకు సుమారు 10 నుంచి 15 క్వింటాళ్ల మేర పత్తి దిగుబడి రావాల్సి ఉంది. ఐతే వర్షాలు కురవకపోవడంతో పత్తి పంటలో ఆశించిన దిగుబడి రాక రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

### పైపులకే రూ.50 వేలయ్యింది



బోయినపల్లిలో సుమారు 15 ఎకరాల మేర భూమి కౌలుకు తీసుకుని పత్తి పంట వేశాను. వర్షాలు లేక చేన్లన్ని ఎండిపోతున్నాయి. రూ.50 వేలతో పైపుల బెండల్లు కొని అర కిలోమీటర్ దూరం నుంచి పత్తి చేలకు పైపులు వేసి రోజు నీరు పడుతున్నాను. చివరి దశలో పెట్టుబడి రావడానికి కష్టపడుతున్నాను.

– సుబ్బారావు, కౌలు, రైతు, బోయినపల్లి

### నెలన్నరగా వర్షాలు లేవు



నల్లరేగడి నేలలో నాలుగు ఎకరాల మేర పత్తి పంట వేశా. అడపా దడపా వర్షాలు కురుస్తాయని భావించా. నెలన్నరగా వర్షాలు లేవు. నా చేనుకు అందుబాటులో నీటి వసతి లేదు. పత్తి చేను పూత కాత దశలో ఉంది. నీటి పదను లేకపోవడంతో దేవుడి మీద భారం వేశాను.

– బోయిని హరీశ్, బోయినపల్లి

### చేనుకు పోబుద్ధి అయితలేదు



రెండెకరాల మేర పత్తి పంట వేసిన. మొదలు వేసిన పత్తి విత్తనాలు మొలవ లేదు. తర్వాత మళ్లీ విత్తనాలు వేశాక మొలకలు వచ్చాయి. రోజు వర్షాలు కురవడంతో కలుపు బాగా అయ్యింది. తర్వాత కొద్ది రోజులకు గెరువు ఇచ్చినంక వర్షాలు లేవు. ఇపుడు పత్తి చేలకే పోబుద్ది అయిత లేదు.

– ఆమిదాల రాజిరెడ్డి, తడగొండ, రైతు

## కులసంఘాలను కలుపుకొనిపోతాం

- బీఆర్‌ఎస్ వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు



చల్మెడకు మద్దతు తెలుపుతున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

**వేములవాడ/వేములవాడఅర్బన్:** బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు కుల సంఘాల మద్దతు పెరుగుతోంది. వేములవాడ మండలం చింతల్‌ఠాణా పునరావాస కాలనీకి చెందిన మున్నూరుకాపు సంఘం నాయకులు, వేములవాడకు చెందిన మున్నూరుకాపు సంఘానికి చెందిన యువకులు, కోనరావుపేట మండలంలోని తండాలకు చెందిన యువకులు, పట్టణానికి చెందిన అంబేడ్కర్ సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి తమ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ కుల సంఘాలను కలుపుకుని పోతున్నామని, ఇప్పటికే కుల సంఘాలకు సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు, నిధులు మంజూరు చేశారన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీధర్, బొప్పా శ్రీనివాస్ తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**పెళ్లి వేడుకల్లోనూ ప్రచారం**

**వేములవాడ:** ఆదివారం పెళ్లిలు జోరుగా ఉండటంతో పోటీలో ఉన్న అభ్యర్థులు తన ప్రచారాన్ని కొనసాగిస్తూ వెళ్లారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు, కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ తమ ప్రచారాన్ని కొనసాగించారు. అలాగే జర్మనీ పర్యటన ముగించుకుని వేములవాడకు వచ్చిన ఎమ్మెల్యే రమేశ్‌బాబుతో కలిసి వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు, అభ్యర్థి లక్ష్మీనరసింహారావు

**బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం**

**రుద్రంగి:** మండల కేంద్రంలో జెడ్పీటీసీ గట్ల మీనయ్య, నాయకులతో కలిసి గడప గడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, మెనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంటె రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమాలకర్, నాయకులు గంగం మహేశ్, రాజేశం, పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్



మర్రిగడ్డలో బోనాలు, బతుకమ్మలతో ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

**చందుర్తి:** ఇందిరమ్మ రాజ్యం కావాలంటే ప్రజలందరూ చేతి గుర్తుపై ఓటు వేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వేములవాడ నియోజకవర్గ అభ్యర్థి ఆది శ్రీనివాస్ కోరారు. మండలంలోని మూడపల్లి, అనంతపల్లి, మర్రిగడ్డ, దేవుని తండా, సలపతి తండా, కట్టలింగంపేట, గోస్కులపల్లె గ్రామాల్లో ఆదివారం ప్రచారాన్ని చేపట్టారు. మర్రిగడ్డ గ్రామంలో మహిళలు బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా మీ మధ్యలో ఉండి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నానని, ప్రజలే తన బలం.. బలగం అని నమ్ముకున్న తనను ఈ ఎన్నికల్లో గెలిపిస్తే ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేపట్టి చూపిస్తానని అన్నారు. జెడ్పీటీసీ కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

**ప్రైవేట్ టీచర్లతో ఆత్మీయ సమావేశం**

వేములవాడ పట్టణంలోని మహాలింగేశ్వర గార్డెన్స్‌లో నియోజకవర్గస్థాయి ప్రైవేట్ టీచర్స్‌తో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ముందు వరుసలో ఉండి పోరాటం చేసిన విద్యార్థులు, నిరుద్యోగులకు కేసీఆర్ పాలనలో ఒరిగిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని అన్నారు. అధికారంలోకి రాగానే క్యాలెండర్ ప్రకారం ఉద్యోగ నియమాకాలను చేపడతామన్నారు.



మూడపల్లిలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

**పతి కోసం సతి ప్రచారం**

**వేములవాడ:** ఆది శ్రీనివాస్ సతీమణి వనజ, పలువురు మహిళలు ఆదివారం ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

## చేతులు కలిపారు.. చేయూతనందించారు



వధూవరులకు సాయం అందజేస్తున్న గ్రామస్తులు

**వేములవాడరూరల్:** ఊరు కాని ఊరు నుంచి వలస వచ్చిన నిరుపేద కుటుంబానికి మేమున్నామంటూ చేతులు కలిపి వారికి చేయూతనిచ్చారు. వేములవాడ మండలంలోని ఫాజుల్‌నగర్ గ్రామానికి ఆరేళ్ల క్రితం వరంగల్ జిల్లా నుంచి ఒక నిరుపేద జంట వచ్చింది. వారికి ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురుకు పెళ్లి కాగా, రెండో కూతురు పెళ్లికి డబ్బులు లేక ఆ కుటుంబం సాయం అర్థించింది. దీంతో గ్రామంలోని యువకులతో పాటు ఎన్‌ఆర్‌ఐలు తలా కొంత సహాయం చేసి పెళ్లి ఖర్చుతో పాటు పుస్తెమెట్టెలు అందజేసి ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నాగుల వేణుగోపాల్, ఎన్‌ఆర్‌ఐ గొడుగు రాజుకుమార్, నగేశ్, అజ్జు, పొన్నం మహేశ్, దుర్గం సురేశ్, మహిపాల్, జక్కుల తిరుపతి, గడ్డం హన్మాండ్లు, రేపాక భాను పాల్గొన్నారు.

### పుస్తెమెట్టెలు అందజేత



పుస్తెమెట్టెలు అందజేస్తున్న బలరాం

**వేములవాడరూరల్:** వేములవాడ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన వెలుగుల మల్లారెడ్డి పద్మల కూతురైన రాధికకు ఆదివారం వివాహం జరగగా వారికి కరీంనగర్ మిల్క్ డెయిరీ ఆధ్వర్యంలో గ్రామ శాఖ అధ్యక్షుడు గుగ్లోతు బలరాం చేతుల మీదుగా పుస్తె, మెట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా వారు డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావుకు, పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఉపాధి అవకాశాల కోసం బీజేపీని గెలిపించాలి

- బీజేపీ వేములవాడ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు



మామిడిపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అభ్యర్థి వికాస్‌రావు

**కోనరావుపేట:** విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం బీజేపీని గెలిపించాలని వేములవాడ బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి, బావుసాయిపేట, గోవిందరావుపేట, వట్టిమల్ల, గొల్లపల్లి, కమ్మరిపేటతండా, మరిమడ్ల, అజ్మీరాతండా, నిమ్మపల్లి, కోనరావుపేట, ఎగ్లాస్‌పూర్, శివంగాలపల్లి గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు నాగారంలో వృత్తి విద్యా శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో వేములవాడ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంలో ఉందన్నారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజన్న ఆలయాన్ని నిర్లక్ష్యం చేశారన్నారు. మోదీ పాలనతోనే సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపాడి సురేందర్‌రావు, గొట్టె రామచంద్రం, జవ్వాజి తిరుపతిగౌడ్, పురుషోత్తంరావు, సురేశ్ అన్ని గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరుతున్న సర్పంచ్ దివ్య, ప్రవీణ్

**బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ సర్పంచ్**

మండలంలోని అజ్మీరాతండా సర్పంచ్ ఇస్లావత్ దివ్య వికాస్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన సందర్భంగా సర్పంచ్ దివ్య, ఆమె భర్త ప్రవీణ్‌కు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వికాస్‌రావు గెలుపు కోసం పాటుపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేందర్‌రావు, తిరుపతి, రామచంద్రం, నాగరాజు, జ్యోతి, అన్నపూర్ణ, ఎంపీటీసీ రేణుక పాల్గొన్నారు.

## ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

- ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్‌రెడ్డి

**ఎల్లారెడ్డిపేట:** ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని సీఐ శశిధర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఆయా పార్టీల నాయకులతో సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో శాంతియుతంగా ఎన్నికల ప్రచారం చేసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలన్నారు. ఓటర్లను డబ్బులు, మద్యంతో ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలతో పాటు పార్టీల నాయకులను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దన్నారు. అభ్యర్థులతో పాటు ప్రచారం చేసే నాయకులు, కార్యకర్తలపై నిఘా ఉందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని శాంతియుతంగా ప్రచారం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

**ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి**

**తంగళ్లపల్లి:** ప్రతి పౌరుడు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఇల్లంతకుంట ఎస్సై దాస సుధాకర్ అన్నారు. ఆదివారం ఇల్లంతకుంట మండలంలోని వెల్జిపూర్, ఓబులాపూర్, పొత్తూరు గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజలు సహకరించాలన్నారు. పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ రక్షణగా ఉంటుందన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### స్వామియే శరణం అయ్యప్ప

**ముస్తాబాద్:** మండలంలోని గూడూరులో చీటి జితేందర్‌రావు గృహంలో అయ్యప్పస్వామి పడి పూజ మహోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. రాజుగురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన పడి పూజలో అయ్యప్ప మాలధారులు అభిషేకాలు, భజన అనంతరం మెట్ల పూజ చేసి పడి వెలిగించారు. ఆలయ కమిటీ చైర్మన్ జితేందర్‌రావు, ఎంపీపీ శరత్‌రావు, గురుస్వాములు శ్రీనివాస్, నర్సాగౌడ్, నాగరాజు, వేముల రవీందర్, యాదగిరి, అంజాగౌడ్, రాజు, గౌతంరావు, బాపురావు పాల్గొన్నారు.



ఉత్సవ మూర్తికి అభిషేకం చేస్తున్న భక్తులు

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని అల్మాస్‌పూర్–కంచర్ల గ్రామాల మధ్య ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని గుంటపల్లిచెరువు తండాకు చెందిన అజ్మీర కిషన్, సంతోష్ బైక్‌పై ఎల్లారెడ్డిపేటకు వచ్చి తిరిగి వెళ్తుండగా అడ్డుగా వచ్చిన అడవిపందిని తప్పించే యత్నంలో బైక్ అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో కిషన్ తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను ప్రైవేట్ వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

### దుప్పట్లు పంపిణీ

**రుద్రంగి:** చలి తీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో రుద్రంగి మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ వసతి గృహంలోని విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన దుప్పట్లు, స్టడీ మెటీరియల్స్‌ను హాస్టల్ సిబ్బంది అందజేశారు. హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

**చందుర్తి:** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు వార్డెన్ రవీంద్ర స్వామి దుప్పట్లు ఆదివారం పంపిణీ చేశారు. చలి తీవ్రత పెరగడంతో విద్యార్థులకు అందించాల్సిన దుప్పట్లతో పాటు స్కూల్ బ్యాగులను, స్టడీ మెటీరియల్‌ను హాస్టల్‌లోని 71 మంది విద్యార్థులకు అందించినట్లు వార్డెన్ వివరించారు.

### ఇందిరమ్మకు నివాళి



**రుద్రంగి:** మండల కేంద్రంలో ఆదివారం దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



### పెచ్చులూడుతున్నయ్

**ఎల్లారెడ్డిపేట:** మండలం రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోని భవనం పెచ్చులూడుతున్నాయి. విద్యార్థులపై పెచ్చులు పడుతుండడంతో భయం భయంగా చదువుకుంటున్నారు. మరమ్మతు చేయాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు ఎస్ఎంసీ సమావేశాల్లో కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.